# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-03-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. రాజకీయ పార్టీలు చేపట్టే కార్యక్రమాలకు సువిధ యాప్ ద్వారా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు.**

**2. తెలంగాణలో అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**

**3. సవరణ షెడ్యూల్ ప్రకారం ఈఏపీసెట్‌ను మే 16 నుంచి 22 వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ప్రకటించింది.**

**4. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్..పాలిసెట్‌ను రాష్ట్ర విద్యాశాఖ వాయిదా వేసింది.**

**5. ఈరోజు అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం.**

===========================

దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వున్న దృష్ట్యా రాజకీయ పార్టీలు ఎటువంటి కార్యక్రమం చేపట్టాలన్న సువిధ యాప్ ద్వారా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు 46 మంది వాలంటీర్లు, ఒప్పంద ఉద్యోగులను విధుల నుంచి తొలగించామని తెలిపారు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక పరీక్ష.. డీఎస్సీ వాయిదావేయాలని వెయ్యికి పైగా ఫిర్యాదులు అందాయని.. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వస్తేనే డీఎస్సీ పరీక్ష జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 144 సెక్షన్ అమలవుతోందని, ఎలాంటి కార్యక్రమం అయినా అనుమతులు తీసుకోవాలని ముఖేశ్ కుమార్ మీనా పేర్కొంటూ....

.......వాయిస్...... 45 సెకన్లు.....

--------------------------

రాష్ట్రంలో ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సన్నాహక ఏర్పాట్లపై అమరావతి సచివాలయంలో పోలీస్ డైరెక్టర్ జనరల్ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాతో కలిసి నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 46 వేల 165 పోలింగ్ కేంద్రాల్లో కనీసం 50 శాతం కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. వెబ్ కాస్టింగ్ ఉన్న పోలింగ్ కేంద్రాలను నేరుగా కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసి పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈసారి ఎన్నికల్లో 85 ఏళ్లు నిండిన వృద్ధులు, వివిధ అంగవైకల్యం కలిగిన ఓటర్లకు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ బందోబస్తుకు లక్షా 50 వేల మంది రాష్ట్ర పోలీసులతో పాటు 522 కంపెనీల రాష్ట్ర సాయుధ రిజర్వ్ పోలీసులు, 465 కంపెనీల కేంద్రసాయుధ రిజర్వ్ పోలీసులతో పాటు కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి హోంగార్డులు తదితర సిబ్బందిని నియమించనున్నామని వెల్లడించారు.

---------------------------

అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల పూర్తి చిత్తశుద్ధితో ఉందని ఒక ప్రకటనలో వివరించారు. పదేళ్లపాటు అస్తవ్యస్త విధానాలతో రైతులను అగమ్యగోచరంగా చేశారని.. ఇప్పుడు రైతుల కోసమే పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై కొందరు అనవసర విమర్శలు చేయడం తగదని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఈఏపీసెట్ షెడ్యూలులో ఉన్నత విద్యామండలి మార్పు చేసింది. మొదట ప్రకటించిన షెడ్యూలు ప్రకారం మే 13వ తేదీ నుంచి 19 వరకు పరీక్షలు జరగాల్సి ఉండగా, సరిగ్గా పోలింగ్ రోజునే సెట్ ప్రారంభం కావాల్సి వస్తున్నందున, దానిని మే 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యేలా నిన్న సవరణ షెడ్యూలు విడుదల చేసింది. 16, 17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు.. 18 నుంచి 22 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరుగుతాయని ఉన్నత విద్యామండలి తెలిపింది. అలాగే పీజీసెట్ షెడ్యూలును కూడా సవరించింది. జూన్ 3వ తేదీన ప్రారంభం కావాల్సిన పీజీ సెట్‌ను అదే నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపింది. ఏపీఆర్‌సెట్ పరీక్షలు మే 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొంది. కాగా.. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఏప్రిల్ 27వ తేదీనే పాలీసెట్ జరుగుతుందని, ఇందులో ఎలాంటి మార్పులు లేవని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి నిన్న ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్..పాలిసెట్‌ను రాష్ట్ర విద్యాశాఖ వాయిదా వేసింది. మే 17వ తేదీ పాలిసెట్ జరగాల్సి ఉండగా.. మే 24వ తేదీన నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు గత నెలలో పాలిసెట్ నోటిఫికేషన్ వెలువడింది. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లోని డిప్లొమా సీట్లను పాలిసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. 100 రూపాయల ఆలస్య రుసుంతో ఏప్రిల్ 24వ తేదీ వరకు, 300 రూపాయల ఆలస్య రుసుంతో ఏప్రిల్ 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నీట్ పీజీ ప్రవేశ పరీక్షను నేషనల్ మెడికల్ కమిషన్ రీ–షెడ్యూల్ చేసింది. జూన 23వ తేదీన ఈ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించింది. జూలై 15వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామని, ఆగస్టు 5 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపింది. సెప్టెంబరు 16వ తేదీ నుంచి నీట్ పీజీ తరగతులు ప్రారంభమవుతాయని, పీజీ కోర్సుల్లో చేరేందుకు అక్టోబరు 21 చివరి తేదీ అని పేర్కొంది. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినవారే నీట్ పీజీ రాసేందుకు అర్హులని స్పష్టం చేసింది.

---------------------------

ఈరోజు అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. పర్యావరణ సమతుల్యతను, సహజ వనరులను పరిరక్షించేందుకు అటవీ సంపదను కాపాడవల్సిన ఆవశ్యకతను తెలియచేసేందుకు ఐక్యరాజ్యసమితి 2012 నుంచి ఏటా మార్చి 21వ తేదీన అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం "అడవుల – ఆవిష్కరణలు–మెరుగైన ప్రపంచానికి కొత్త పరిష్కారాలు " అనే ఇతివృత్తంతో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దేశంలో అటవీసంపదను కాపాడవలసిన ఆవశ్యకతను చాటిచెబుతూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ఏప్రిల్ 15వ తేదీ వరకు ఓట్ల నమోదుకు ఉన్న అవకాశాన్ని ఆంధ్రప్రదేశ్ యువత వినియోగించుకోవాలని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సూచించారు. సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులతో ఎన్నికల్లో అక్రమాలను అడ్డుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు. నగదు పంపిణీ, ఓటర్లను ప్రలోభ పెట్టడం, ప్రభుత్వ ఉద్యోగులతో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించడం వంటి ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజలు తమ దృష్టికి వచ్చిన ప్రతి తప్పును యాప్ ద్వారా అత్యంత సులభంగా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉందని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

---------------------------

జార్ఖండ్ నుంచి కోస్తా ఒడిషా మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో కొన్ని చోట్ల దక్షిణ కోస్తాంధ్రలో ఒకటి రెండు చోట్ల ఈరోజు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలలో ఈ రోజు అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఇలావుండగా... వీటన్నింటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తాలో అనేక ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి నిన్న సాయంకాలం వరకు పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు.. కొన్నిప్రాంతాల్లో భారీవర్షాలు కురిశాయి. అకాల వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడినా.. మెట్ట పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాకినాడ జిల్లాలో నిన్న ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం టి.రాయవరంలో పిడుగుపాటుకు పశువుల కాపరి మృతిచెందాడు. మరొకరికి గాయాలయ్యాయి.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనూ ఈదురు గాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షం పడింది. ఏలూరు సమీప చొదిమెళ్ళలో పిడుగుపాటుకు ఒక రైతు మృతి చెందాడు. అనేక మండలాల్లో పొలాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న, కల్లాల్లో ఎండబెట్టిన ఎండుమిర్చి తడిసిపోయింది. విజయగనరం జిల్లాలో ఉదయం నుంచి రాత్రి వరకూ తేలికపాటి జల్లులు కురిశాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి.

======================